# పెళ్ళికూతురు

"ఎంత దారుణం! పాపం, మూడో పెళ్ళి గీతకూడ వుంది కామాలు" అన్నాడు రాఘవయ్య దీనంగా.

వెంకటేశ్వర్లు గారు చిరునవ్వాపుకుని దీపం కొద్దిగా పెద్దదిచేసి బాల్య స్నేహితుడి వంక చూస్తూ వూరుకున్నాడు.

రాఘవయ్య సూటిగా వెంకటేశ్వర్లుగారి మొహం వంక చూసి పదేళ్ళయింది. అంతక్రితం రాఘవయ్య, వెంకటేశ్వర్లుగారు కూడా కొంచెం అటూ యిటూగా తన హోదాకు సమానమైన హోదాగల వాడేనన్నట్టు నటించాడు. కాని పదేళ్ళ కిందట రాఘవయ్య కొన్ని పరిస్థితుల వల్ల దివాలా యెత్తటం, వెంకటేశ్వర్లుగా రొక్కపట్టున మరో ఇరవై యెకరాలు సుక్షేత్రమైన మాగాణీ భూములు కొనటం జరిగింది. భగవంతుడింత పక్షపాతంతో ప్రవర్తించటం రాఘవయ్యకు చాలా ఆగ్రహ కారణమైంది. కాని వెంకటేశ్వర్లు తన బాల్య స్నేహితుడని నలుగురి చెవులా వేస్తూండటం చాలా అవసరమనీ, తనికమీద ఆయనవంక తేరిచూడలేక పోవటంవల్ల తనకు కలిగే హాని ఏమీ లేదనీ తీర్మానించుకున్నాడు రాఘవయ్య. ఆ పెద్దమనిషి యిప్పుడూ ప్రకారంగానే వెంకటేశ్వర్లుగారి దృష్టి తప్పించి ఇల్లంతా కలియచూసి, "యెలాగైనా యింటికి సంబంధించిన జ్యోతి లేకపోయిన తరవాత యిల్లు కళావిహీనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమిటి? మళ్ళీ కొంత కాలం ఇలా..."

"తరవాత?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

తన ధోరణిలో తను అనదలుచుకున్న ముక్కే వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానంగా అనాలంటే రాఘవయ్యకు ఒక్క క్షణం నోరు పట్టేసింది. పాడబోతున్న వాణ్ణి పాడమన్నట్టు. కాని చాలా దక్కాముక్కీలు తిని చేవ దేలిన ఘటం కాబట్టి తట్టుకున్నాడు.

"తరవాత యేముందీ? కల్యాణం! ఆగుతుందా ఏమిటి?"

"నాకింకా ఆ మాట తట్టలేదు సుమా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

ఆయన మాటలో వెక్కిరింపు రాఘవయ్య గమనించలేదు.

"తట్టలేదూ! యింకా నీ దగ్గిరికి ఎవరూ రాలేదేమిటి? నాతో నీ విషయం

నలుగురైదుగురు ప్రస్తావించారు. చిన్నవాడు, జమీందారు, బుద్ధిమంతుడు, మంచి పదవిలో వున్నవాడని శిఫార్సు చేశాను."

"ఎవరు చిన్నవాడు?"

"నువ్వే, ముప్ఫై అయిదేళ్ళవాడు ముసలివాడా ఏమిటి?"

"మనిద్దరికీ ఒక్కసారే అక్షరాభ్యాసమయింది. తెలుసునా? నీ వయస్సెంత?"

రాఘవయ్య ఆశ్చర్యం నటించాడు. ఆయన వయస్సు నలభై అయిదుకే మాత్రమో ఎక్కువే కాని తక్కువ కాదు.

"అయితే మాత్రం! డెబ్భై ఏళ్ళకు పునర్వివాహం చేసుకున్నవాళ్ళున్నారు."

"యిచ్చేవాళ్ళుంటే..."

"నీ కిచ్చేవాళ్ళేలేరా? ఎనభై మంది పిల్లలు దొరుకుతారు. ఆ పూచీ నాది. కాని అన్ని విధాలా అనువైన పిల్ల నేను చూసినంతట్లో..."

"యిచ్చేవాళ్ళు నన్ను చూస్తారా? నా ఆస్తి చూస్తారా!"

"అది చాలా కష్టమైన ప్రశ్న. కాని నిన్ను చూసి యిచ్చేవాళ్ళు లేకపోలేదు."

"ఒకర్ని చెప్పు."

"నేను" రాఘవయ్య చిరునవ్వు నవ్వాడు.

వెంకటేశ్వర్లుగారు భావరహితమైన మొహంతో రాఘవయ్య వంక నిదానించి చూశాడు. రాఘవయ్య నైచ్యాన్ని గురించి ఆయన కేవిధమైన అనుమానం ఎన్నడూ లేదు.

"నేను మా శారదాంబకు ఎక్కడ తగిన సంబంధం దొరుకుతుందా అని చూస్తున్నాను. వెంకటేశ్వర్లూ! యిదే యింకోళ్ళయితే తొందరపడి పెళ్ళి చేసుకోమన్ను. కాని నా దగ్గిర నీకు అనుమానం ఎందుకు? చిన్నప్పటినుంచీ పిల్లదాన్నెరుగుదువు కదా! దాని అంద చందా లెరుగుదువు కదా! దాన్నింకొకరి కివ్వటానికి క్యూడా నాకిష్టంగా లేదు."

వెంకటేశ్వర్లుగారు మాట్లాడలేదు. రాఘవయ్యకు కొద్ది నిరుత్సాహం కలిగినా వెనక్కు తియ్యలేదు. ఆ వేడిమీదనే మరిరెండు దెబ్బలుకొట్టి చూద్దామనుకున్నాడు.

"నీ కెలాగో పెళ్ళి కావలసి వుంది. నా పిల్లకూ వివాహం కావాలి. నీతో సంబంధమంటే నా కెంత ఉత్సాహంగా వుందో నీకూ అంత ఉత్సాహంగానే వుందని అనుకుంటున్నాను. ఆలోచించుకో. కొత్తవాళ్ళతో సంబంధం చేసుకుని పెళ్ళయిన మర్నాటినించీ సకలమైన నసాపద్దం కంటె స్నేహితంలో బాంధవ్యం – "

వెంకటేశ్వర్లుగారు ఏ సమాధానం చెప్పకుండా సరిగ్గా అయిదు నిమిషాలు కూర్చున్నాడాలోచిస్తూ.

"ఒక్కసారి మీ పిల్లతో నేను మాట్లాడాలి."

"అంతకన్నానా? ఇప్పుడే మా యింటికి పోదాం పద!"

రాఘవయ్య ఉత్సాహం చెప్పటానికి వీల్లేదు.

"రేపుదయం ఎనిమిదింటికి వస్తాను సరిగా."

రాఘవయ్య తన కుమార్తె వివాహం అయిపోయినట్టే భావించుకున్నాడు. ఇక తనకు డబ్బు కొరత లేదు. ఎస్టేటుకంతా తనే మేనేజరు. ఇంత ఆస్తీ తన కూతురి సంతానానికే వస్తుంది. వెంకటేశ్వర్లుగారికి ప్రథమ కళత్రం వల్ల కలిగిన కుమారుడు లక్ష్మీకాంతం వున్నాడు. మొదటినించీ శారదకు, ఆ పిల్లవాడికీ స్నేహం. రాఘవయ్య దృష్టి చాలాకాలం లక్ష్మీకాంతం మీద వుంటూ వచ్చింది. తన కుమార్తె ఇంకా పసిపిల్లగా ఉన్న రోజుల్లోనే "అడుగోవే బావ. బావను పెళ్ళి చేసుకుంటావమ్మా?" అంటుండేవాడు రాఘవయ్య. కాని ఇప్పుడదంతా పోయింది. మూడేళ్ళకింద వెంకటేశ్వర్లుగారు కొడుకును యింట్లో నుంచి వెళ్ళగొట్టాడు. మళ్ళీ తండ్రీ కొడుకులు ఒకరి మొహం ఒకరు చూసుకోలేదు. ఈ వైరానికి – లక్ష్మీ కాంతానికీ, సవతితల్లికీ ఏదో సంబంధమున్నదని తప్ప మిగిలిన విశేషాలెవ్వరికీ తెలీలేదు. తండ్రీ కొడుకులిద్దరూ ఆ విషయం ఎవరితోనూ యెత్తలేదు. లక్ష్మీకాంతం నిర్దోషి అనుకోటానికయినా ఈ మూడేళ్ళనించీ అతన్ని గురించి చాలా చెడ్డ కబుర్లు వినబడుతూ వచ్చినై.

వెంకటేశ్వర్లుగారి రెండో భార్య పోయిన తరవాత కూడా తండ్రీ కొడుకులు కలవకపోవటం చూసి శారదకు ముసలాడు తప్పడనుకున్నాడు రాఘవయ్య. ఇక లక్ష్మీకాంతం పిత్రార్జితానికి బాహ్యుడే. పాపం రాఘవయ్య ప్రయత్నానికన్నీ అడ్డాలే అయినై. చివరకు వెంకటేశ్వర్లును చూడబొయ్యేటప్పుడుకూడా యింతా చేస్తే వెంకటేశ్వర్లు మళ్ళీ పెళ్ళి చేసుకుంటానంటాడో లేదోనని అనుమానమే. ఇంతకు భగవంతుడు తనయందుండ బట్టే –

తన స్నేహితుణ్ణి వసారా గదిలో కూర్చోబెట్టి రాఘవయ్య అదివరకే పూర్తిగా అలంకరించి వున్న శారదను తెచ్చాడు.

"మే మిద్దరం కాస్సేపు రహస్యంగా మాటలాడుకోవాలి. నువ్వేదైనా పని వుంటే చూసుకో" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

రాఘవయ్య మనసులోనే 'అంతకంటేనా?' అనుకుని బయటికి నిష్క్రమించాడు.

"పరవాలేదు. తలుపు తెరిచే వుండనీ" అన్నాడు వెంకటేశ్వర్లు. రాఘవయ్య తలుపవతలనించి సంభాషణ వినటానికవకాశం లేనందువల్ల హతాశుడై తలుపు తెరిచి వెళ్ళిపోయినాడు.

వెంకటేశ్వర్లు శారదను చూసి "మా లక్ష్మి బతికుంటే ఈపాటికీ పిల్ల వయస్సుది. ఇంత బాగుండేదేమో కూడా" అనుకున్నాడు. శారద మాత్రం ఆయన్ను లక్ష్యం చెయ్యకుండా కొంచెం సేపు అటూ ఇటూ పచారు చేసి చివరకు అలమారు దగ్గిరికి పోయి తన వొంటిని ఉన్న రొండు మూడు నగలూ తీసేసి అలమారులో పెట్టి తీరిగ్గా జడ విప్పుకోటం మొదలుపెట్టింది.

"అమ్మాయి! నీ కెన్నేళ్ళు?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

శారద కనుబొమలు ముడేసి "మీ కన్న నలభై ఏళ్ళుతక్కువ" అన్నది.

వెంకటేశ్వర్లుగారు నవ్వేడు. "ఆc! అంత అన్యాయంగా వుండదు. పదేళ్ళయినా లేవా నీకు?"

"ఇంకా రెండేళ్ళెక్కువే."

"జుట్టు విరబోసుకున్నా అందంగానే వున్నావు. పెళ్ళికూతుర్ని చేస్తే ఇంకా బాగుంటావు. నేను వచ్చిన పని తెలుసునా?"

"ఆc! నా గొంతు కొయ్యటానికి. నా గొంతంత సులభంగా తెగదు."

"ఏం అంత మాటన్నావు? నీకు కల్యాణం అయే ఏర్పాటు చేద్దామనుకుంటున్నానే!"

శారద ధైర్యంగా వెంకటేశ్వర్లుగారిని సమీపించి ఆయనవంకే చూస్తూ నిలబడ్డది. నడుముకు చేతులు పెట్టుకోటం ఒక్కటే తక్కువనుకున్నాడు వెంకటేశ్వర్లుగారు. ఆయన కప్పుడే ఆ పిల్లను చూస్తే భయం కూడా ప్రారంభమయింది.

"నన్ను మా నాన్న మీకిచ్చి చేస్తే నూతిలో పడతాను. జ్ఞాపకం వుంచుకోండి. నే నాడపిల్లలందరిలాంటి దాన్ని కాదు. మా అమ్మ నన్నెప్పుడు శక్తీ అని పిలుస్తుంది." కిటికీలోనించి గాలివచ్చి ఆ పిల్ల జుట్టు అటూ ఇటూ కొట్టేస్తున్నది.

"దాదాపు అలాగే వున్నావు, అయితే నన్ను చూస్తే నీకంత మంచి అభిప్రాయం కలగక పోవటానిక్కారణం?"

"మీరు మనిషికాదు. అయితే కాంతాన్ని పెళ్ళాం మాటలు నమ్మి ఇంట్లోనించి వెళ్ళగొడతారా?"

వెంకటేశ్వర్లుగారు కొంచెంసేపు జవాబు చెప్పలేదు.

"నువ్వందరితో ఇలాగే మాటలాడుతావా?"

"మాటలాడను."

"నా తోనేనా?"

"ఆc."

కొంచెంసేపిద్దరూ మౌనంగా ఊరుకున్నారు.

"కాంతంవల్ల తప్పు లేదని నీకేం నమ్మకం?"
"నాకు తెలుసు, నేను కాంతాన్ని ఇంత దాన్నప్పటినుంచీ ఎరుగుదును."
"నేనెరుగనా?"
"ఎరగరు."
"ఇప్పుడు కాంతం ఎవరితో తిరుగుతున్నాడో తెలుసునా?"
"ఆఁ."
"రౌడీలు. బోగంవాళ్ళు."
"మీకన్నా, మీ పెళ్ళాంకన్నా మంచివాళ్ళే."
వెంకటేశ్వర్లుగారు దీనంగా నవ్వాడు.
"నీకెలా తెలుసు!"
"లేకపోతే కాంతం వాళ్ళతో యిన్నాళ్ళు కలిసి వుండడు."
"కాంతం ఉన్నచోట చెడుండదా?"
"ఉండదు."
"నీకింత ధైర్యంగా మాట్లాడటం ఎవరు నేర్పారు?"
"మీ అబ్బాయి."
శారదకు కాంతం స్నేహితం కాక శిష్యత్వం కూడా వుందన్న మాట!
"కాంతం ప్రతిరోజూ ఇక్కడికి వస్తుంటాడా?"
"ఆఁ."
"నా విషయం ఏమన్నా అంటాడా?"
"అనడు. నా నోటివెంట మీ విషయం ఎప్పుడన్నా మాట తూలివస్తే ఆ రోజునించీ తనతో నన్ను మాటలాడ వద్దన్నాడు."
వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపడి "ఎందుకు?" అన్నాడు.
"తెలివిగలవాడు కనక."
"అయితే అటువంటిదేదైనా జరిగితే వాడితో మాటలాడటం మానేస్తావా?"
"మానను."
"ఏం?"
"మిమ్మల్ని తిట్టటానికి నాకేమీ అభ్యంతరం లేదు – "
"అందరాడవాళ్ళూ యిలా మాట్లాడటం నీ కిష్టమేనా?"
"అందరి కొడుకులూ కాంతం స్థితికి రావటం మీ కిష్టమా?"
"లేదు."

"నాకూ లేదు."

"అది కాంతం తప్పేమో."

"కాదు. అయితే ఇదీ నా తప్పే."

"అయితే వాడికోసం నువ్విట్లా మారిపోయినావా?"

"ఆఁ."

వెంకటేశ్వర్లుగారు నవ్వుకుంటూ 'నిన్నింకా ఎంతసేపు పరీక్ష చెయ్యను' అనుకున్నాడు బిగ్గరగానే.

"ఇంతసేపు నన్ను పరీక్ష చెయ్యండి అని మిమ్మల్ని బొట్టు కాటుక పెట్టి పిలవలేదు. బహుశా మా నాన్న నడిగితే తెలుస్తుంది. ఇంకా ఎంతసేపు పరీక్ష చెయ్యాలో."

"మా కాంతం వల్ల తప్పులేదని చాలా కాలం కిందటనే కనిపెట్టాను."

"మీకామాట అనటానికి నామోషీ లేదా? నిజం తెలిసిన క్షణం వెళ్ళి మీ అబ్బాయి కాళ్ళెందుకు పట్టుకోలేదు?"

"నా చేత కాలేదు. తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నాను."

"మీ అబ్బాయే పొరపాటు పడితే తెలిసిన వెంటనే పోయి కాళ్ళు పట్టుకుంటాడు."

"అవును వాడికి తల్లి మంచి గుణాలన్నీ వచ్చినై."

"అటువంటి భార్యపోతే పశువైతే తప్ప తిరిగి పెళ్ళి చేసుకోడు."

"నీ యిష్టం వచ్చినట్టను. నేను మొండెత్తు వేశాను. చాలాకాలం కిందనే నా గుండె రాయయిపోయింది. ఇక అరిగి పోవలసిందే కాని కరగదు."

"కరగదు."

ఈ మాట కేవలం నిజంకాదు. ఈ మాట అంటుండగానే ఆయన కళ్ళు చెమ్మగిల్లినై.

శారద తనకు పరాజయం ప్రారంభమైందని కనుక్కుంది.

"ఇలా రా అమ్మా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు. శారద మారు చెప్పకుండా మెల్లిగా వచ్చి ఆయన పక్కనే నిలుచుంది.

"జడవేసుకోమ్మా. నిన్ను మా కాంతంకిచ్చి చేస్తాను. ఒక ఆడది మమ్మల్నిద్దర్ని వేరుచేసింది. మళ్ళీ మమ్మల్నిద్దర్నీ కలపటం నీ వంతు." శారద తలవంచుకుంది. ఆ పిల్ల కళ్ళనించి రెండు బొట్లు రాలటం వెంకటేశ్వర్లెరగడు. కాని ఆయన కళ్ళనించి కారిన బిందువులు తన తలమీద పడటం శారద గమనించి అవే అక్షింతలకింద గ్రహించింది.

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, సెప్టెంబర్ 1933***